ఈనాడు
వరంగల్
సోమవారం ఆగస్టు 31, 2026



నర్సంపేటలో ప్రధాన మార్గంలో మురుగు కాల్వల్లో పూడిక తీస్తున్న కూలీలు

పూడికతీత.. పుర ఖజానాకు వాత

నర్సంపేట(వరంగల్), న్యూస్‌టుడే: పారిశుద్ధ్య సిబ్బందితో పని చేయించడంలో విఫలమైన అధికారుల వల్ల పురపాలిక ఖజానాకు రూ.లక్షల్లో గండి పడుతోంది. పారిశుద్ధ్య కార్మికులతో సక్రమంగా మురుగు కాల్వలు శుభ్రం చేయించకపోవడంతో మట్టితో పూడుకుపోయి వర్షం కురిస్తే వరద, వ్యర్థ నీరంతా రహదారులపై పారుతోంది. కాల్వల నుంచి వచ్చే దుర్వాసనను భరించలేమని మురుగు పారడం లేదని ఫిర్యాదులు చేసే అధికారులు పారిశుద్ధ్య కార్మికులను పంపిస్తున్నారు. వారు పారలతో పైపైనే చెత్త, వ్యర్థాలు తొలగించి వెళ్లడంతో కొద్ది రోజులకే సమస్య మొదటికి వస్తోంది.

మొన్న కార్మికులు.. నేడు టెండర్

2018లో నగర పంచాయతీ పాలకవర్గం పదవీకాలం ముగియడానికి ఆరు నెలల ముందు పారిశుద్ధ్య విభాగంలో 40 మందిని పొరుగు సేవల కింద నియమించారు. కొత్తగా విధుల్లో చేరిన కార్మికులతో వేసవి కాలమంతా వరంగల్ మార్గం, అమరవీరుల స్తూపం నుంచి అంబేడ్కర్, జయలక్ష్మి కూడళ్ల వరకు ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న మురుగు కాలువల్లో పూడిక తీయించారు. కాల్వల్లో తవ్విన ట్రాక్టర్ల కొద్దీ పూడిక మట్టిని నగరపంచాయతీకి చెందిన స్థలాల్లో గుంతలు పూడ్చడానికి వాడారు. మిగిలిన మట్టిని డంపింగ్ యార్డుకు తరలించారు. అప్పుడు కార్మికులు శుభ్రం చేసిన మురుగు కాల్వల్లో ప్రస్తుతం పూడికతీతకు అధికారులు పుర సాధారణ నిధుల నుంచి రూ.10 లక్షలు వెచ్చించి టెండర్ పిలిచారు. పనులు పొందిన గుత్తేదారు వారం రోజుల నుంచి కూలీలతో పట్టణ ప్రధాన రహదారిలోని మురుగు కాల్వల్లో పూడిక తీత పనులు చేయిస్తున్నారు.

రెండు విధాలా నష్టం

పట్టణంలో బజార్లు ఊడ్చి, మురుగు కాల్వల్లో మట్టి తొలగించి శుభ్రం చేసేందుకు మున్సిపల్ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులను పొరుగు సేవల్లో నియమించారు. ప్రతినెలా ఒక్కొక్కరికి నెలకు రూ.16,600 వేతనం చెల్లిస్తున్నారు. పొరుగు సేవల కార్మికులను విభాగాలుగా విభజించి విధులు కేటాయించారు. సంబంధిత జవాన్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వంటి అధికారులు కార్మికులతో పనులు చేయించడంలో విఫలమయ్యారనే ఆరోపణలున్నాయి. కార్మికులున్నా.. కాల్వలు శుభ్రం చేసేందుకు మళ్లీ రూ.10 లక్షలు ఖర్చు పెడుతున్నట్లు తెలిసింది.

● ఈ విషయంపై 'పుర' కమిషనర్ భాస్కర్ వివరణ కోసం చరవాణిలో యత్నించగా.. తర్వాత మాట్లాడదామని సందేశం పంపారు.

నర్సంపేట పురపాలిక వివరాలు

మొత్తం కార్మికులు: 127	
మహిళలు: 41	డ్రైవర్లు: 18
ట్రాక్టర్ల హెల్పర్లు: 10	జవాన్లు: 8
కాల్వలు తీయడం, చెత్తకుప్పలు ఎత్తి పోయడం: 50	



ఎండిన చెరువు.. పచ్చదనానికి నెలవు

ఇక్కడ కనిపిస్తున్న చిత్రం ఉద్యాన వనంలోని పచ్చని మైదానం, ఎండిన చెట్లను అమర్చినట్లు ఉంది కదూ.. కానీ ఇది హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారి పక్కన రాంపూర్‌లోని రంగసముద్రం చెరువు. ప్రస్తుతం వర్షాలు సరిపడా కురవకపోవడంతో చెరువులో నీరు తగ్గిపోయింది. దీంతో ఇలా పచ్చని పొదల్లో ఎండిన చెట్లు కనువిందు చేయడంతో అటుగా వెళ్లే వాహనదారులు అక్కడ కాసేపు ఆగి ఈ ప్రకృతి అందాలను తమ చరవాణుల్లో బందిస్తున్నారు. – న్యూస్‌టుడే, హసన్‌పర్తి

పైసలిస్తేనే పని.. పన్నుల విభాగం తీరిది!

నిఘా

కార్పొరేషన్, న్యూస్‌టుడే: రూ.20- 30 వేలు ఇస్తే కొత్త ఇంటి నంబరు దస్త్రం ముందుకు కదులుతుంది. తాత్కాలిక షెడ్డుకు ఆస్తిపన్ను మదింపు చేయాలంటే రూ.25 వేలు, ఖాళీ స్థలంలో ఎలాంటి నిర్మాణంలేని వాటికి రూ.50 వేలు, వేకెంట్ ల్యాండ్ ట్యాక్స్(వీఎల్‌టీ) రూ.10-20 వేల ధర పలుకుతోంది. గ్రేటర్ వరంగల్ పన్నుల విభాగం తీరిది. దీనికి క్షేత్రస్థాయిలో పనిచేసే చిరుద్యోగులు మధ్యవర్తులుగా వ్యవహరిస్తున్నారు. వివాదాస్పదమైనవి, న్యాయ స్థానాల్లో కేసులు కొనసాగుతున్న స్థలాలకు ఇంటి నంబర్లు కేటాయించడం చర్చనీయాంశంగా మారింది. కొంత మంది రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు(ఆర్ఐలు), బిల్ కలెక్టర్ల ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.

ఒప్పందం కుదిరితేనే..

బల్దియా పన్నుల విభాగంలో ముందస్తు ఒప్పందం కుదిరితేనే దస్త్రాలు(ఫైళ్లు) ముందుకు కదులుతాయి. లేదంటే నెలల తరబడి పెండింగ్‌లో ఉంటాయి. వరంగల్, హనుమకొండ ప్రాంతాల్లోని కొన్ని డివిజన్లలో వార్డు అధికారులు, బిల్ కలెక్టర్లు, డిప్యుటేషన్‌పైన వచ్చిన చిరుద్యోగులు మధ్యవర్తులుగా పనిచేస్తున్నారు. క్షేత్రస్థాయి పరిశీలన సమయంలోనే చర్చలు జరుగుతున్నాయి. అడిగినంత ఇస్తే వారం రోజుల్లోపు కొత్త ఇంటినంబరు వస్తుంది. ఎక్కువ ఇస్తే మరింత త్వరగా ప్రాపర్టీ ట్యాక్స్ అసెస్‌మెంట్ ప్రొసీడింగ్ కాపీ వస్తుందని చెబుతున్నారు.

● ఇటీవల స్థలాల ఆక్రమణలు పెరుగుతుండటంతో చాలామంది ప్రజలు ఇంటినంబరు, వీఎల్‌టీ నంబరు తీసుకుంటున్నారు. దీన్ని ఆసరాగా తీసుకొని గ్రేటర్ వరంగల్ పన్నుల విభాగం క్షేత్రస్థాయి ఉద్యోగులు నిబంధనలకు విరుద్ధంగా పని చేస్తున్నారని తెలిసింది. ఈ విషయంలో క్షేత్రస్థాయి ఉద్యోగి నుంచి ఉన్నతాధికారి వరకు అందరికీ సమానంగా వాటాలు ముడుతున్నాయని ప్రచారం జరుగుతోంది.

ఉదాహరణలు ఇవీ..

● ఎనుమాముల శివారులోని ఓ ఖాళీ స్థలానికి మూడు ఇంటి నంబర్లు కేటాయించారు. నిబంధనల ప్రకారమైతే తాత్కాలిక షెడ్డు నిర్మిస్తే ఆస్తి పన్ను మదింపు చేయాలి. దీనికి విరుద్ధంగా మూడు నంబర్లు ఇచ్చారు. దీనిపై ఫిర్యాదు రావడంతో రద్దు చేశారు. ఇదే స్థలంలో మరొకరికి కొత్త నంబరు కేటాయించారు.

● ఎనుమాముల వంద అడుగుల రోడ్డులో 650 గజాల ఖాళీ స్థలానికి ఇంటినంబరు కేటాయించారు. దీనిపై మరో ఇద్దరు అభ్యంతరాలు తెలిపారు. షెడ్డు లేకున్నా ఉన్నట్లుగా రికార్డులో చూపించారు.

● మడికొండ, కడిపికొండ విలీన గ్రామాల పరిధిలో మూడు ఖాళీ స్థలాలకు ఇంటినంబర్లు ఇవ్వడం వివాదాస్పదమైంది.

● రంగశాయిపేట నాయుడు పంపు శివారులో ఇద్దరు వ్యక్తుల మధ్య స్థల వివాదం కొనసాగుతోంది. ఒకరికి ఇంటి నంబరు ఇవ్వడం పెద్ద గొడవకు దారితీసింది.

● హనుమకొండ వడ్డేపల్లి టీచర్స్ కాలనీ, కేయూ వంద అడుగుల రోడ్డులోని రెండు అపార్ట్‌మెంట్లలో నాలుగు ఫ్లాట్లకు ఇంటి నంబర్లు ఇచ్చారు. వీరి వద్ద పెద్ద మొత్తంలో డబ్బులు డిమాండ్ చేయడంతో అధికార పార్టీ ప్రజాప్రతినిధికి ఫిర్యాదు చేశారని తెలిసింది.

పోతురాజుల విన్యాసం.. పోచమ్మకు బోనం



కాజీపేట పుర వీధుల్లో రథయాత్ర ఎదుట పోతురాజుల నృత్యం

కాజీపేట టౌన్, న్యూస్‌టుడే: కాజీపేట బాపూజీ నగర్‌లో పోచమ్మ బోనాలు వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులు బోనాలను ఊరేగింపుగా తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించారు. రాత్రి ఉత్సవ కమిటీ నిర్వాహకుడు కోంద్ర నర్సింగరావు ఇంటి నుంచి పోచమ్మ విగ్రహ ప్రతిమను పొట్టేళ్లతో ఏర్పాటు చేసిన రథంలో ఉంచి ఊరేగింపుగా తీసుకెళ్లారు. మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ రథయాత్రను ప్రారంభించారు. హైదరాబాద్ నుంచి విచ్చేసిన పోతురాజుల నృత్యాలతో పోచమ్మ తల్లిని కాజీపేట పురవీధుల్లో వైభవంగా ఊరేగించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు నర్సింగరావు, జక్కుల రవీందర్ యాదవ్, నార్లగిరి రమేశ్, శ్రీనివాస్, కోంద్ర శంకర్ పాల్గొన్నారు.

గ్రేటర్‌లో నేడు ప్రజావాణి

కార్పొరేషన్, న్యూస్‌టుడే: వరంగల్ మహా నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో సోమవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజావాణి కార్యక్రమం ఉంటుందని అదనపు కమిషనర్ జోనా ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని 66 డివిజన్లలోని స్థానిక సమస్యలపై కమిషనర్ వెంకన్న వినతిపత్రాలు, ఫిర్యాదులు స్వీకరిస్తామన్నారు.

ప్రత్యేక తరగతుల భత్యం పక్కదారి

రూపాయి ఇవ్వలేదు..

చెన్నారావుపేట మండల కేంద్రానికి చెందిన ఓ విద్యార్థి గణితం, సైన్స్‌లో ఫెయిల్ అయ్యాడు. నర్సంపేటలోని జడ్పీహెచ్ఎస్(బాలికలు)లో రెమిడియల్ తరగతులకు హాజరయ్యాడు. పది సప్లిమెంటరీ పరీక్షలో ఉత్తీర్ణుడై.. ప్రస్తుతం నర్సంపేటలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశం పొందాడు. రూ.1000 ఇస్తామని చెప్పి నేటి వరకు చెల్లించలేదని వాపోయాడు.

వివరాలు తీసుకున్నారు..

వరంగల్ మండలానికి చెందిన ఓ విద్యార్థి గణితంలో తప్పాడు. కాశీబుగ్గలోని నరేంద్ర నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన రెమిడియల్ తరగతులకు హాజరయ్యాడు. సప్లిమెంటరీ పరీక్షలో ఉత్తీర్ణుడై ప్రస్తుతం ఇంటర్ చదువుతున్నాడు. 'ప్రభుత్వం నుంచి మీకు రూ.1000 వస్తాయని పాఠశాల సిబ్బంది బ్యాంకు ఖాతా వివరాలు తీసుకున్నారు. ఇప్పటి వరకు చెల్లించలేదు. దీనిపై అడిగితే స్పందించడం లేదని' విద్యార్థి తండ్రి తెలిపారు.

వరంగల్ విద్యావిభాగం, న్యూస్‌టుడే: పదో తరగతి వార్షిక పరీక్షల్లో తప్పినవారు సప్లిమెంటరీలో ఉత్తీర్ణత సాధించేలా ప్రభుత్వం ప్రత్యేక తరగతులు(రెమిడియల్) నిర్వహించింది. ఆ తరగతులకు హాజరైన వారికి ఒక్కొక్కరికి రూ.1000 రవాణా భత్యం, నోటు పుస్తకాలు, పెన్నుల కోసం రూ.100 కేటాయించింది. జిల్లాలో ప్రభుత్వ యాజమాన్య పరిధిలోని అన్ని పాఠశాలల నుంచి 378 మంది అనుత్తీర్ణులయ్యారు. వీరికి ప్రభుత్వం కేటాయించిన రూ.4.15 లక్షల నిధులను జిల్లా విద్యాశాఖ అధికారులు పక్కదారి పట్టించారు.

జిల్లాలో రెమిడియల్ తరగతుల కోసం విద్యాశాఖ అధికారులు రెండు పాఠశాలలను ఎంపిక చేశారు. అందులో ఒకటి వరంగల్ కాశీబుగ్గలోని నరేంద్రనగర్ ఉన్నత పాఠశాల, రెండోది నర్సంపేటలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల. మే 12 నుంచి జూన్ 3వ తేదీ వరకు విద్యార్థులకు తరగతులు నిర్వహించారు.

రూ.4.15 లక్షలు స్వాహా..

జిల్లా నుంచి పరీక్షలకు హాజరైన 378 విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.1100 చొప్పున రూ.4,15,800లను ప్రభుత్వం జిల్లా విద్యాశాఖ అధికారి ఖాతాలో జమ చేసింది. డీఈవో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయుల నుంచి విద్యార్థుల వివరాలు సేకరించి.. వారి ఖాతాలకు నగదు బదిలీ చేయాల్సింది. కానీ నాలుగు నెలలు గడుస్తున్నా.. రూపాయి చెల్లించలేదు.

ఆరోపణలు వస్తున్నా..

జిల్లా విద్యాశాఖ కార్యాలయంపై అనేక ఆరోపణలు వినిపిస్తున్నాయి. కార్యాలయంలో పనిచేసే కొంత మంది అధికార, సిబ్బంది వసూళ్లకు పాల్పడుతున్నట్లు బహిరంగంగానే విమర్శలున్నాయి. కార్యాలయంలో వివిధ పనుల కోసం వచ్చే ఉపాధ్యాయులు, విశ్రాంత ఉద్యోగుల నుంచి ప్రతి పనికి కొంత మొత్తం వసూలు చేస్తున్నట్లు తెలిసింది. జిల్లా ఉన్నతాధికారులు దృష్టిసారించి జిల్లా విద్యాశాఖను ప్రక్షాళన చేయాల్సిన అవసరముందని ఉపాధ్యాయ సంఘాలు ఆరోపిస్తున్నాయి.

దేవుడి పేరిట భక్తుల దోపిడీ?

నర్సంపేట, న్యూస్‌టుడే: దేవుడి మొక్కులు చెల్లించే భక్తుల నుంచి కొందరు నగదు వసూలు చేస్తుండటం విమర్శలకు తావిస్తోంది. శ్రావణ మాసంలో నర్సంపేట పట్టణంలో అన్నివర్గాల ప్రజలు పోచమ్మ బోనాల వేడుకలు జరుపుతున్నారు. ప్రతి ఇంటి నుంచి బోనం తీసుకెళ్లి అమ్మవారికి బోనం నైవేద్యాలుగా పెట్టి ఎవరి శక్తి మేర వారు చీరలు, కానుకలు సమర్పించి మొక్కులు చెల్లించుకోవడం ఆనవాయితీ. పట్టణంలో దాదాపు 60-70శాతం మంది వరంగల్ రోడ్డులోని పోచమ్మ గుడికి వచ్చి మొక్కులు చెల్లిస్తారు. అమ్మవారికి కోళ్లు, గొర్రెలతో చీరలు, వెండి ఆభరణాలతో మొక్కులు చెల్లించుకుంటారు. కోళ్లు కోసేందుకు రూ.20లు, గొర్రెలను కోసేందుకు ఒక్కో దానికి రూ.150-200 తీసుకుంటున్నారని కొందరు భక్తులు ఆరోపించారు. దేవుడి మొక్కులు సమర్పించేందుకు వెళ్తే నగదు వసూళ్లతో దోపిడీ చేయడమేమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. మున్సిపల్ అధికారులు ఆలయం వద్ద అక్రమ వసూళ్లను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రశాంతంగా నీట్ పీజీ



తనిఖీ చేసి బయటకు వస్తున్న కలెక్టర్ డా.సత్యశారద

లక్నేపల్లి (నర్సంపేట గ్రామీణం), న్యూస్‌టుడే: నర్సంపేట మండలం లక్నేపల్లిలోని బిట్స్ కళాశాలలో జరిగిన నీట్ పీజీ నిర్వహణ కేంద్రాన్ని కలెక్టర్ డా.సత్యశారద ఆదివారం సందర్శించారు. ఇక్కడి పరీక్షా కేంద్రంలో మొత్తం 132 మంది విద్యార్థులకుగాను 127 మంది హాజరు కాగా, అయిదుగురు గైర్హాజరైనట్లు పరీక్ష కేంద్రం నిర్వాహకుడు శ్రీకాంత్ తెలిపారు. విద్యార్థులకు అవసరమైన ఏర్పాట్లను పరిశీలించారు. పరీక్ష ప్రశాంతంగా జరిగేలా కలెక్టర్ అధికారులకు పలు సూచనలు చేశారు. వరంగల్ డీఆర్వో, విజయలక్ష్మి నర్సంపేట ఆర్డీవో ఉమారాణి, నర్సంపేట ఏసీపీ రవీందర్‌రెడ్డి, సీఐ శ్రీనివాస్, ఎస్సై అరుణ్ ఉన్నారు.

గుత్తాధిపత్యం

కార్పొరేషన్, న్యూస్‌టుడే: గ్రేటర్ వరంగల్‌లో కొంతమంది పెద్ద కాంట్రాక్టర్ల గుత్తాధిపత్యం నడుస్తోంది. అభివృద్ధి పనుల కేటాయింపు, బిల్లుల చెల్లింపుల్లో వారు చెప్పిందే వేదం. అధికారులు సైతం వారికి వత్తాసు పలుకుతున్నారు. వరంగల్, హనుమకొండ ప్రాంతాలకు చెందిన 10-15 మంది బడా కాంట్రాక్టర్ల పెత్తనం కొనసాగుతోంది. అధికార పార్టీ ప్రజాప్రతినిధుల అండదండలతో ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని ప్రచారం జరుగుతోంది.

రెండురోజుల క్రితం పెండింగ్ బిల్లుల చెల్లింపుల జాబితాపై గుత్తేదారుల మధ్య వాగ్వాదం జరిగింది. చిన్నాచితక గుత్తేదారులకు బిల్లులు ఇవ్వకుండా అడ్డుపడటం ఎంత వరకు పద్ధతి అని కొందరు నిలదీశారు. నిబంధనలు అమలు చేయాల్సిన అధికారులు ఒత్తిళ్లకు తలొగ్గుతున్నారని తెలిసింది. పెండింగ్‌లో ఉంటున్న అభివృద్ధి పనుల బిల్లుల చెల్లింపుల కోసం గుత్తేదారులకు బ్యాంకు రుణాలు ఇప్పించేందుకు గణాంక విభాగం జాబితా సిద్ధం చేసింది. ఇందులో పెద్ద కాంట్రాక్టర్ల పేర్లు సింహభాగంలో ఉండటంతో చిన్నస్థాయి కాంట్రాక్టర్లు అభ్యంతరాలు తెలిపారు. బిల్లుల చెల్లింపుల్లో సీరియల్ సిస్టమ్ పాటించరా? అని అధికారులను నిలదీశారు. అభివృద్ధి పనుల్లో చక్రం తిప్పే రింగు మాస్టర్లు సూచించిన వారికే బిల్లులు ఇస్తారా? అని ప్రశ్నించారు. ఈ విషయంపై కమిషనర్ వెంకన్నను కలిసి ఫిర్యాదు చేసేందుకు సిద్ధమయ్యారు.

ముందస్తు వసూళ్లు

అభివృద్ధి పనులు, ఎలక్ట్రికల్, ఉద్యాన విభాగంలో పెండింగ్‌లో ఉంటున్న బిల్లుల చెల్లింపుల్లో పెద్ద ఎత్తున పైరవీలు నడుస్తున్నాయని ప్రచారం జరుగుతోంది. సుమారు రూ.25 కోట్ల రుణాలు ఇచ్చేందుకు బ్యాంకర్లు అంగీకరించారు. దీంతో చాలా మంది గుత్తేదారులు గణాంక, ప్రీ ఆడిట్ విభాగాల అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. ఓ అధికారి బిల్లులపై సంతకాలు చేసేందుకు బహిరంగంగానే డబ్బులు డిమాండ్ చేస్తున్నారని తెలిసింది. రూ.లక్షకు రెండువేల చొప్పున ముందస్తు వసూళ్ల దందా నడుస్తుందని ప్రచారం జరుగుతోంది.

ముంచెత్తిన మురుగు.. రహదారిపై పరుగు



హనుమకొండ పెద్దమ్మ గడ్డ కూడలి నుంచి ఆరెపల్లి వెళ్లే జాతీయ రహదారిపై బొల్లం టవర్స్ ప్రాంతంలో భారీగా మురుగు నిలవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో మురుగు రహదారిపై చేరి మడుగును తలపిస్తోంది. దీంతో వాహనదారులు, పాదచారులు అవస్థలు పడుతున్నారు. దాంతోపాటు దుర్వాసన వస్తోందని, సంబంధిత అధికారులు స్పందించి రహదారిపై మురుగును తొలగించాలని నగరవాసులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, హనుమకొండ చౌరస్తా

అసమానతలపై అక్షర యుద్ధం

● పుస్తక రచనలో యువకులు

భీమారం, న్యూస్‌టుడే: మనసులోని భావాలకు అక్షర రూపం ఇస్తూ పుస్తక రచనకు పునాది వేసుకున్నారు. చదువు, ఉద్యోగం చేస్తూనే సమాజంలోని వివిధ సామాజిక, ఆర్థిక అసమానతలను తమ అక్షరంతో ప్రశ్నించి ప్రజల్లో చైతన్యం కలిగేలా ముందుకు సాగుతున్నారు. పుస్తక రచనలతో ఈ యువకులు పలువురి ఆదర్శంగా నిలుస్తున్నారు.

అన్యాయాలకు వ్యతిరేకంగా 'దుసుముడి': వనపాకల దిలీప్



నా చుట్టూ జరుగుతున్న అన్యాయాల్ని, అసమానతలను ప్రశ్నించకుండా ఉండలేకపోయా. అవమానకర సన్నివేశాలు, రాజకీయ నాయకుల చర్యలపై స్పందిస్తూ నా అంతఃసంఘర్షణలను తెలపడానికి కవిత్వం నాకో మార్గమైంది. అందుకే నేను రాసిన 'దుసుముడి' కవితా సంపుటిలో పదేళ్లలో దేశంలో జరిగిన ఘటనలు కళ్లముందు కనిపిస్తాయి. మనుషులను ప్రేమించేవారే.. అందరూ సమానంగా ఉండాలని కోరుకుంటారు. నా కవిత్వంలో కూడా అన్యాయాలను, అవమానాలను వ్యతిరేకించే కోణంతోపాటు మనుషులను ప్రేమించడం కూడా బలంగా కనిపిస్తుంది.

యువ


బాధితులకు అండగా 'నీలం రంగు నది'



- హాథీరామ్ సభావట్

జన్మనిచ్చిన తల్లిని కోల్పోయాక బాల్యమంతా హాస్టల్‌లోనే గడిపాను. జీవితంలో పొందిన ఒంటరితనాన్ని పోగొట్టుకునేందుకు నాలో నేను చెప్పుకోవాలనుకున్న భావాలను అక్షరాలుగా రాసుకున్నాను. నా హైస్కూల్ టీచర్ నాగార్జున ద్వారా పలు కవితల గురించి తెలుసుకుని ఓనమాలు నేర్చుకున్నాను. కేయూలో ఇంటిగ్రేటెడ్ కెమిస్ట్రీ పూర్తి చేశాను. కవిత్వాన్ని సమాజపరం చేయాలని, బాధితుల వైపు నిల్చుండాలన్న ఆలోచనలతో రాయడం మొదలుపెట్టాను. నా వ్యక్తిగత, తండా జీవితాన్ని కలగలిపి 'నల్లింకు పెన్ను'గా రాశాను. ఆ తర్వాత వచ్చిన 'నీలం రంగు నది' ఆదివాసీ యుద్ధం నుంచి పాలస్తీనా యుద్ధం వరకు బాధితుల వైపు నిల్చుంటుంది.

నా స్పందనల నుంచి 'పిలుపు': అమృతరాజు



పితృస్వామ్యం, భూస్వామ్య విధానాలతో అన్ని వర్గాల ప్రజలు పీడింపబడుతున్నారు. అందుకే అంబేడ్కర్, జ్యోతిరావు పులే ఆశయాలకు అనుగుణంగా విద్యార్థులను కవిత్వంతో చైతన్యం చేయాలనుకున్నాను. సొంతంగా కరపత్రాలు రాసుకుని చర్చల్లో పాల్గొంటూ నా అభిప్రాయాలను పంచుకోవడంతో సాహిత్య రచన మొదలుపెట్టా. కరోనా సమయంలో ప్రజలు ప్రాణాపాయ స్థితిలో ఉన్నప్పటికీ పాలకులు ప్రజలను హింసించడం ఆపలేదు. 2015 నుంచి 2023 వరకు జరిగిన కొన్ని ఘటనలకు నా స్పందనలను మలిచి 'పిలుపు' పుస్తకాన్ని రాశాను.

షట్లర్ కీర్తికి రజత పతకం



వరంగల్ క్రీడా విభాగం, న్యూస్‌టుడే: ఓరుగల్లు యువ సంచలనం షట్లర్ కీర్తి రజత పతకంతో అదరగొట్టింది. ఈ నెల 25 నుంచి 30 వరకు మహారాష్ట్రలో పుణె అంతర్జాతీయ (గ్రాండ్ ప్రిక్స్) బ్యాడ్మింటన్ టోర్నమెంట్ జరిగింది. ఈ పోటీల్లో బాలికల డబుల్స్ విభాగంలో బరిలోకి దిగిన మంచాల కీర్తి అద్భుతమైన ప్రదర్శనతో థాయ్‌లాండ్ జట్టుపై రన్నరప్‌గా నిలిచింది. వరుస విజయాలతో దూసుకెళ్తున్న కీర్తిని వరంగల్ బ్యాడ్మింటన్ సంఘం ప్రతినిధులు డా. రమేశ్‌కుమార్, పింగిళి రమేశ్‌రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.

వైద్య విద్యార్థుల సేవార్థ్

ఎంజీఎం ఆసుపత్రి, న్యూస్‌టుడే: నిత్యం పుస్తకాలతో కుస్తీ పట్టడంతో పాటు ఖాళీ సమయంలో సామాజిక సేవ చేస్తున్నారు పలువురు వైద్య విద్యార్థులు. కాకతీయ వైద్య కళాశాల(కేఎంసీ) విద్యార్థులు రక్తదానంపై 'బ్లడ్ డోనర్స్ క్లబ్', గ్రామీణుల ఆరోగ్య సమాచారం, 'సేవ కోసం గ్రామాల దత్తత', ఏజెన్సీ ప్రాంత వాసులకు వైద్య సేవలు అందించడానికి 'ఆరోగ్య మిత్ర యాత్ర' పేరిట వివిధ కార్యక్రమాలు చేపడుతున్నారు. 'సేవార్థ్ క్లబ్' పేరిట ఏడాది పొడగునా సామాజిక కార్యక్రమాలు చేస్తున్నారు. గతేడాది ఫైనలియర్ విద్యార్థులు ఈ క్లబ్ ఆధ్వర్యంలో విజయవంతంగా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ ఏడాది ఎంబీబీఎస్ ఫైనలియర్ విద్యార్థులు ఉత్సాహంగా ప్రజలను చైతన్యపరుస్తున్నారు.



సీపీఆర్‌పై శిక్షణ ఇస్తున్న వైద్య విద్యార్థులు

సమాజంలో అపోహలు, మూఢ నమ్మకాలు పోగొట్టాలనే దృఢ నిశ్చయంతో 'సేవార్థ్' కార్యక్రమాలు నిర్వహించడానికి సమాయత్తమైంది. వాస్తవ పరిస్థితులు తరగతి గదులకో, ఆసుపత్రులకో పరిమితం కాకుండా.. సమాజం ముందుంచడానికి ఈ క్లబ్ సభ్యులు కృషి చేస్తున్నారు.

ముఖ్యోద్దేశం ఇదీ..

శాస్త్రీయమైన వైద్య సమాచారం సామాన్య ప్రజలకు చేరవేయడం, అపోహలు తొలగించడం, ఆరోగ్యంపై సరైన నిర్ణయాలు తీసుకునేలా ప్రజలను చైతన్య పరిచి, అవసరమైన వారికి అండగా నిలవడమే క్లబ్ ముఖ్య ఉద్దేశం.

కార్యవర్గం ఎవరెవరంటే..

సేవార్థ్ క్లబ్ అధ్యక్షుడిగా ఆర్‌కే.శ్రీరాంరెడ్డి, ఉపాధ్యక్షురాలిగా కె.సాహితి, ప్రధాన కార్యదర్శులుగా టి.వంశీ, పి.దీప్నా, కోశాధికారిగా సంచిత పాటిల్, సోషల్ మీడియా బాధ్యుడిగా జయానంద్, సభ్యులుగా ఉష్మశ్రీ, అలీ, ఆకాంక్ష, శ్రీజ, సేహారిక, నీరజ్, శ్రీశైలం ఉన్నారు. గతేడాది సేవార్థ్ క్లబ్ కమిటీ అధ్యక్షుడిగా అబ్దుల్ రవూఫ్, ఉపాధ్యక్షురాలిగా అనన్య, కార్యదర్శిగా సుధాంశ్‌రెడ్డి, సభ్యులుగా హేమాంగిని, రామకృష్ణ పనిచేశారు.

మార్పు తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నాం..



సమయం దొరికినప్పుడల్లా సమాజాన్ని చైతన్యపర్చే కార్యక్రమాలు పెట్టుకుట్టున్నాం. ఆరోగ్యపరమైన విషయాల్లో ప్రజల్లో ఇంకా చైతన్యం రావాల్సి ఉంది. అపోహలు తొలగిపోయేలా మార్పు తీసుకురావడానికి కృషి చేస్తున్నాం.
– ఆర్‌కే.శ్రీరాంరెడ్డి 'సేవార్థ్' క్లబ్ అధ్యక్షుడు

చేపట్టిన కార్యక్రమాలు..: ☛ క్లబ్ ఆధ్వర్యంలో ఈ ఏడాది జనవరి 27 నుంచి ఫిబ్రవరి 3వ తేదీ వరకు విద్యార్థులకు సీపీఆర్ సంపూర్ణమయ్యే విధానం, పరీక్ష భయం పోగొట్టేలా కార్యక్రమాలు నిర్వహించారు. ☛ 2025 ఆగస్టు 30న ఒక్కరోజే 9 పాఠశాలల్లో 470 మంది విద్యార్థులకు సీపీఆర్‌పై శిక్షణ. ☛ 5 ఆగస్టు 2025న వారోత్సవాల సందర్భంగా తల్లిపాల ప్రాధాన్యం వివరిస్తూ.. 300 మంది విద్యార్థులతో 'హెల్త్ రన్' కార్యక్రమం. ☛ కౌమారదశలోని విద్యార్థులకు ఆరోగ్య కార్యక్రమాలు 2025 జూన్ 27న హనుమకొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, 19 జూన్ 2025న, 18 జులై 2026న ప్రైవేటు విద్యా సంస్థలో చేపట్టారు. ☛ 6 ఆగస్టు 2026 రోజున ఎమర్జెన్సీ మెడికల్ అవేర్‌నెస్ కార్యక్రమం వరంగల్ రైల్వే స్టేషన్‌లో నిర్వహించారు. రైల్వే సిబ్బందికి, పోలీసులు, కూలీలకు సీపీఆర్‌పై శిక్షణ ఇచ్చారు.

ఆలయ సమాచారం

✦ భద్రకాళి ఆలయంలో సోమవారం ఉదయం 5.30 గంటలకు అమ్మవారికి అభిషేకం, శ్రీచక్రేశ్వర స్వామికి అభిషేకం ఉంటుంది. ఉదయం 9 గంటల నుంచి మహా మండపంలో విశిష్ట కుంకుమార్చనలు జరుగుతాయి. ఉదయం 7 నుంచి రాత్రి 8.30 గంటల వరకు సర్వ దర్శనాలు ఉంటాయి.

✦ హనుమకొండ వేయిస్తంభాల ఆలయంలో సోమవారం ఉదయం 5.30 గంటల నుంచి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు జరుగుతాయి. శ్రావణ మాసం ప్రత్యేక పూజలు ఉంటాయి. ఉదయం 6 గంటల నుంచి అర్చనలు. ఉదయం 7 నుంచి రాత్రి 8.30 గంటల వరకు సర్వ దర్శనాలు ఉంటాయి.

✦ హనుమకొండలోని చారిత్రక హనుమద్గిరి పద్మాక్షి దేవాలయంలో శ్రావణ మాసోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. సోమవారం ఉదయం 5:00 గంటలకు పరివార దేవతామూర్తులకు అభిషేకం ఉంటుంది. ఉదయం 7:00 గంటల వరకు మహా మంగళహారతి, 7:15 గంటల నుంచి కుంకుమార్చన, పుష్పార్చన నిర్వహిస్తారు. మధ్యాహ్నం 12:30 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 6:30 గంటల వరకు భక్తులకు సర్వదర్శనం ఉంటుంది.

✦ కాళేశ్వర క్షేత్ర ఆదిముక్తీశ్వర బాలాలయంలో సోమవారం ఉదయం 5.30 గంటలకు ద్విలింగాలకు మహాన్యాస రుద్రాభిషేకం, ఉదయం 8 గంటలకు రూ.1000ల ప్రత్యేక అభిషేకాలు, 10.30కు శుభానంద, ముక్తీశ్వర స్వామికి నిత్య కల్యాణం, రాత్రి 7 గంటలకు జ్ఞాన సరస్వతీ ఘాట్ వద్ద కాళేశ్వరం అర్చకులచే త్రిహారతి, రాత్రి 8 గంటలకు ఆలయ ద్వార బంధనం ఉంటుంది.

– న్యూస్‌టుడే, రంగంపేట, హనుమకొండ సాంస్కృతికం, కాళేశ్వరం

గోదావరిలో 'పెద్ది' అస్థికల నిమజ్జనం



సుదర్శన్‌రెడ్డి సంతాప సభలో పాల్గొన్న నాయకులు

భద్రాచలం, న్యూస్‌టుడే: నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అస్థికలను ఆదివారం భద్రాచలం పవిత్ర గోదావరిలో నిమజ్జనం చేశారు. కుటుంబ సభ్యులతో పాటు ఆ నియోజకవర్గం నుంచి భారీ స్థాయిలో నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి అస్థికలను నదిలో కలిపారు. దీనికి ముందు స్నానాల ఘాట్‌లో పురోహిత సంఘం అధ్యక్షుడు రామావఝుల రవికుమార్ పర్యవేక్షణలో ప్రత్యేక పూజలు చేశారు. తర్వాత స్థానికంగా ఉన్న ఓ సత్రంలో సంతాప సభను నిర్వహించారు. సుదర్శన్‌రెడ్డి చిత్రపటానికి ఆయన సతీమణి స్వప్న, కుమారుడు నిదర్శన్‌రెడ్డి, కుమార్తె ధర్మిష్టారెడ్డితో పాటు నాయకులు నివాళులర్పించారు. గత నెల 31న సుదర్శన్‌రెడ్డి మృతి చెందారని.. అతడి మరణం తీరని లోటన్నారు. తెలంగాణ ఉద్యమ కెరటంగా పోరాటం సాగించారని, భారాసలో కీలక నేతగా ఉంటూ నియోజకవర్గం అభివృద్ధికి విశేష సేవలు అందించారని కొనియాడారు.

ఉన్నత విద్యకు ఉపకార వేతనం

హసన్‌పర్తి, న్యూస్‌టుడే: ఎస్సీ వర్గానికి చెందిన విద్యార్థులు 12వ తరగతి అనంతరం ఉన్నత విద్యను భ్యసించేందుకు ఆర్థిక సాయానికి కేంద్రం ప్రభుత్వం టాప్ క్లాస్ పథకం కింద ఉపకార వేతనాన్ని అందిస్తోంది. 2026-27 విద్యా సంవత్సరంలో దాదాపు 2,000 మంది విద్యార్థులను ఎంపిక చేయనున్నట్లు ఒక ప్రకటన విడుదల చేసింది. విద్యా ఖర్చులు పుస్తకాలు, స్టేషనరీ, ల్యాప్‌టాప్ తదితర అవసరాల కోసం మొదటి ఏడాదికి రూ. 86 వేలు, తర్వాత ప్రతి ఏడాదికి రూ. 41 వేలు చొప్పున అందిస్తారు. ప్రైవేటు విద్యా సంస్థలో ట్యూషన్ ఫీజుతోపాటు ఇతర ఫీజులు కూడా పూర్తిగా చెల్లిస్తారు.

ఎస్సీ విద్యార్థులకు టాప్ క్లాస్ పథకం

అర్హతలు

✦ ఎస్సీ కేటగిరీకి చెందిన విద్యార్థులై ఉండాలి. ✦ కుటుంబ వార్షికాదాయం అన్ని వనరుల నుంచి రూ. 8 లక్షల వరకు ఉండాలి. ✦ గుర్తింపు పొందిన సంస్థలో రెగ్యులర్ కోర్సులో ప్రవేశం పొంది ఉండాలి. ✦ మొదటి సంవత్సరం విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు ✦ మెరిట్ ఆధారంగా ఎంపిక చేస్తారు. 30 శాతం బాలికలకు కేటాయించారు.

దరఖాస్తు విధానం

ఐఐటీ, ఎన్ఐటీ, ట్రిపుల్ ఐటీ, ఐఐఎం, ఎన్ఎల్‌యూల తోపాటు కేంద్ర, రాష్ట్ర గుర్తింపు కలిగిన ప్రముఖ సంస్థల్లో ప్రవేశాలు పొంది ఉండాలి. నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్ (ఎన్ఎస్‌పీ) ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, బ్యాంకు ఖాతా, ప్రవేశ ర్యాంకు, ఫీజు వివరాలను పొందుపర్చాలి.

ముఖ్యమైన అంశాలు

☛ ఒక కుటుంబంలో గరిష్ఠంగా ఇద్దరికి మాత్రమే పథకం వర్తిస్తుంది. ☛ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న ఇతర ఉపకార వేతనాలు పొందుతున్నవారు అనర్హులు ☛ విద్యార్థి తదుపరి తరగతికి ప్రమోట్ కాకపోతే ఉపకార వేతనం నిలిపివేస్తారు. ☛ దరఖాస్తుకు చివరి తేదీ: 2026 అక్టోబరు 31.

రామప్ప శిల్పకళ అద్భుతం



శిల్పకళను తిలకిస్తున్న ఐటీడీఏ ఎస్‌డీసీ ప్రతాప్‌రెడ్డి

వెంకటాపూర్, న్యూస్‌టుడే: యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప ఆలయ నిర్మాణ చాతుర్యం, శిల్పకళా సంపద అణువణువూ అద్భుతమేనని ఏటూరునాగారం ఐటీడీఏ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ప్రతాప్‌రెడ్డి అన్నారు. ఆదివారం కుటుంబ సమేతంగా రామప్పను సందర్శించారు. పూజారులు స్వాగతం పలికి, రామలింగేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు చేయించారు. తీర్థ ప్రసాదాలు అందించి ఆశీర్వచనం చేశారు. జర్మనీకి చెందిన ముగ్గురు పర్యాటకులు సందర్శించారు. రామప్ప పరిసరాల్లో ప్రకృతి అందాలను వీక్షించారు. సరస్సులో బోటు షికారు చేశారు. వారివెంట ఆలయ ఈవో భాస్కర్, పురావస్తు, పర్యాటక, దేవాదాయ శాఖ సిబ్బంది ఉన్నారు.

గ్రామాల సమగ్రాభివృద్ధే లక్ష్యం



ముత్తారంలో రహదారి పనులు ప్రారంభిస్తున్న మంత్రి ప్రభాకర్

భీమదేవరపల్లి, న్యూస్‌టుడే: గ్రామాల సమగ్రాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఆదివారం భీమదేవరపల్లి మండలంలో 'పల్లెపల్లెలో పొన్నమన్న... పల్లెపల్లెలో ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా ముత్తారం, గొల్లపల్లి, ముస్తఫాపూర్, వీరభద్రనగర్, గట్లనర్సింగాపూర్, బొల్లోనిపల్లి గ్రామాల్లో మంత్రి పర్యటించారు. గ్రామాల్లో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ముత్తారం-లంబాడి తండా-గట్లనర్సింగాపూర్ రహదారి అభివృద్ధికి రూ. 3.74 కోట్ల పనులకు శంకుస్థాపన చేశారు. ప్లాస్టిక్‌కు దూరంగా ఉండాలని, స్టీల్ బ్యాంకులను వినియోగించాలన్నారు. సౌర విద్యుత్తును ప్రోత్సహించాలన్నారు. ఆయిల్ పామ్ సాగుపై రైతులు దృష్టి సారించాలన్నారు. గౌరవెల్లి ప్రాజెక్టు పూర్తి చేయడం నా బాధ్యత అని మంత్రి ప్రభాకర్ స్పష్టం చేశారు. గొల్లపల్లి బస్‌స్టేషన్ నుంచి ముత్తారం వరకు రూ.3.5 కోట్లతో తారు రోడ్డుకు ప్రతిపాదనలు పంపామన్నారు. వీరభద్రనగర్ పంచాయతీకి స్థలం ఇస్తే భవనానికి నిధులు మంజూరు చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో శేషాద్రి, ఏడీఏ ఆదిరెడ్డి, ఉద్యానవన శాఖ అధికారి కమలాకర్‌రెడ్డి, సర్పంచులు ఊరడి భారతి, నేతల చంద్రమోహన్, గడ్డం సుజాత, కొర్ర గోపాల్, బొల్లంపల్లి అజయ్, బొల్లి మాసన, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పోచంపల్లి రాజిరెడ్డి, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, ఎంపీడీవో వీరేశం, తహసీల్దార్ రాజేశ్ పాల్గొన్నారు.

రూ.కోట్లతో నిర్మించి.. కొనుగోళ్లు మరిచి!



నిరుపయోగంగా ఉన్న రేకుల షెడ్డు

పర్వతగిరి(వర్ధన్నపేట), న్యూస్‌టుడే: అన్నదాతలు పంటలు విక్రయించుకోవడానికి నిర్మించిన వ్యవసాయ సబ్ మార్కెట్ నిరుపయోగంగా మారింది. దళారుల చేతుల్లో రైతులు మోసపోకూడదని సకల సౌకర్యాలతో పర్వతగిరి మండల కేంద్రంలో 1995లో అతిథి గృహంతో పాటు ధాన్యం, పత్తి, పసుపు ఆరబోసేందుకు షెడ్లు, గోదాంలు నిర్మించారు. వ్యవసాయ సబ్ మార్కెట్‌లో కొనుగోలు చేసేవారు లేకపోవడంతో రైతులు ధాన్యం తదితర పంటలను తీసుకురావడం లేదు. దీంతో రూ.కోట్లతో నిర్మించిన సబ్ మార్కెట్ యార్డు అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మారింది. ప్రారంభించిన కొత్తలో అరకొరగా కొనుగోళ్లు నిర్వహించిన మార్కెట్ అధికారులు ఆ తర్వాత చేతులెత్తేశారు. ప్రతి సంవత్సరం ఐకేపీ ఆధ్వర్యంలో మహిళా సంఘాలు, ప్రాథమిక సహకారం సంఘం ఆధ్వర్యంలో మార్కెట్‌లో ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలతో 15 రోజుల పాటు రైతులతో కొంత సందడి నెలకొంటుంది. అనంతరం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతోంది. కొనుగోలు, అమ్మకాలు లేని సబ్ మార్కెట్‌లో 2015లో 5వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదాంతో పాటు ప్రత్యేక నిధులతో కళాతోరణం నిర్మించారు.



బొగతలో పర్యాటకుల సందడి

వాజేడు, న్యూస్‌టుడే: పర్యాటకుల కేరింతలతో బొగత జలపాతం సందడిగా మారింది. ఆదివారం సెలవురోజు కావడంతో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. జలపాతం పరవళ్లు తిలకిస్తూ.. ఈత కొలనులో స్నానాలు చేస్తూ సందడి చేశారు. ఓవైపు చిరుజల్లులు, మరోవైపు జలపాతం నీటి తుంపరలతో పర్యాటకులు తడిసి ముద్దయ్యారు.

ప్రజా వ్యతిరేక విధానాలను నిలదీసేందుకు చలో దిల్లీ



దిల్లీకి తరలివెళ్తున్న సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు బృందం

కాజీపేట టౌన్, న్యూస్‌టుడే: దేశంలో నిరుద్యోగం, ధరల పెరుగుదల వంటి ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకు చలో దిల్లీ కార్యక్రమాన్ని చేపట్టినట్లు సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు అన్నారు. సెప్టెంబరు 1న న్యూదిల్లీలోని రాంలీలా మైదానంలో తలపెట్టిన 'బద్లావ్ జరూరీ హై' (మార్పు తప్పనిసరి) మహా సభకు హనుమకొండ జిల్లా నుంచి సీపీఐ నాయకులు, కార్యకర్తలు ఆదివారం బయలుదేరారు. కాజీపేట రైల్వే జంక్షన్ ఎదుట శ్రీనివాస్‌రావు జెండా ఊపి పార్టీ శ్రేణులనుద్దేశించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, మాజీ ఎమ్మెల్యే రాజారెడ్డి, నేదునూరి జ్యోతి, కరుణాకర్, శ్రీనివాస్, భిక్షపతి, మద్దెల ఎల్లేష్, స్టాలిన్, రాజమౌళి, శంకర్‌నాయక్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల హామీలు అమలు చేయాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పింగిళి శ్రీపాల్‌రెడ్డి

హనుమకొండ విద్యావిభాగం, న్యూస్‌టుడే: ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిళి శ్రీపాల్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. ఆదివారం హనుమకొండలోని జిల్లా కార్యాలయంలో పీఆర్టీయూ టీఎస్ సర్వసభ్య సమావేశం సంఘం బాధ్యులు మండల తిరుపతిరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఆరు డీఏలను విడుదల చేయాలన్నారు. మోడల్ స్కూల్, గురుకుల ఉపాధ్యాయులకు జీరో పద్దు కింద వేతనాలు అందించాలని తెలిపారు. ఉపాధ్యాయుల సమస్యల సాధనకు సెప్టెంబరు 1న హైదరాబాద్ ఇందిరా పార్కు వద్ద నిర్వహించే మహాధర్నాను విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీహరి, శ్రీనివాస్‌రెడ్డి, ఆర్.ప్రభాకర్‌రెడ్డి, ఎస్.పట్టాభి, రవీందర్‌రెడ్డి, మహేందర్, ఉమ్మడి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

త్రినగరి

యువత క్రీడల్లో రాణించాలి



హ్యాండ్‌బాల్ పోటీలను ప్రారంభిస్తున్న ప్రభాకర్‌రెడ్డి

వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: మేజర్ ధ్యాన్‌చంద్ స్ఫూర్తిగా యువత క్రీడల్లో రాణించాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బొద్దిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా మూడు రోజులపాటు సైక్లింగ్, హ్యాండ్‌బాల్, వాలీబాల్, అథ్లెటిక్స్, జిమ్నాస్టిక్స్, బాక్సింగ్ పోటీలను నిర్వహించారు. ఆదివారం జరిగిన పలు క్రీడాంశాల్లో విజేతలకు ముఖ్య అతిథిగా ప్రభాకర్‌రెడ్డి హాజరై బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టుదల, క్రమశిక్షణ కలిగిన క్రీడాకారుల తమ లక్ష్యాన్ని సులువుగా చేరుకుంటారన్నారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి డీవైఎస్‌వో కొత్త ప్రశాంత్, జూడో సంఘం కార్యదర్శి కైలాస్‌యాదవ్, హ్యాండ్‌బాల్ సంఘం కార్యదర్శి శ్యామల పవన్, డీఎస్‌ఏ కోచ్‌లు ప్రభుదాస్, రమేశ్, నవీన్, విష్ణువర్ధన్, జీవన్ పాల్గొన్నారు.

కనకదుర్గ కాలనీ పార్కు అభివృద్ధి చేస్తాం



మాట్లాడుతున్న వరంగల్ ఎంపీ డా.కావ్య, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

వడ్డేపల్లి, న్యూస్‌టుడే: హనుమకొండ 59వ డివిజన్ కనకదుర్గ కాలనీలోని జీడబ్ల్యూఎంసీ పార్కు, కమ్యూనిటీ కేంద్రాన్ని ఆధునిక సౌకర్యాలతో మోడల్ పార్కుగా అభివృద్ధి చేస్తామని వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. ఆదివారం వారు పార్కును సందర్శించి వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్, లైటింగ్, పచ్చదనం, మొక్కల నిర్వహణను పరిశీలించారు. వాకర్స్, స్థానికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. వర్షాకాలంలో వాకింగ్ ట్రాక్‌పై నీరు నిలవకుండా శాశ్వత పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. చిన్నారుల కోసం ప్రత్యేక ఆట స్థలం, మెరుగైన ఆట పరికరాలు ఏర్పాటు చేయాలన్నారు. వృద్ధులు, మహిళలు, యువత కోసం ధ్యానం హాలు, మెరుగైన ఓపెన్‌జిమ్, పటిష్టమైన లైటింగ్, భద్రతకు సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ గుజ్జుల వసంత, జీడబ్ల్యూఎంసీ అదనపు కమిషనర్, మున్సిపల్ అధికారులు, వాకర్ అసోసియేషన్ సభ్యులు, విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

నేడు ఉచిత నేత్ర వైద్య శిబిరం

రంగశాయిపేట, న్యూస్‌టుడే: ఎర్రబెల్లి ప్రదీప్‌రావు ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ ఎర్రబెల్లి వినీత్‌రావు ఆధ్వర్యంలో సోమవారం అండర్ రైల్వేగేట్ ప్రాంతంలోని రాజశ్రీ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని విజయవంతం చేయాలని భాజపా ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు మదాసు రాజు కోరారు. ఈ అవకాశాన్ని పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. 33, 39 డివిజన్ల పరిధిలో ఆదివారం ఇంటింటా తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు.

చికెన్ ధరలు
(కిలో వెల రూపాయలలో)

వెన్‌కాబ్	
ఫాం:	117
రిటైల్:	144
డ్రెస్డ్:	223
స్కిన్‌లెస్:	252

రాఖీ పండగకు మేనమామ ఇంటికి వచ్చి..

కుంటలో పడి అన్నదమ్ముల మృత్యువాత



వినయ్ కిశోర్



రాజేశ్

ములుగు క్రైం, న్యూస్‌టుడే: రాఖీ పండగకు అమ్మతో కలిసి మేనమామ ఇంటికి వచ్చిన అన్నదమ్ములు నీటి కుంటలో పడి మృతి చెందిన విషాదకర ఘటన ఆదివారం ములుగు జిల్లాలో చోటు చేసుకుంది. బంధువులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ములుగు జిల్లా మంగపేట మండలం కమలాపూర్‌కు చెందిన మాలోతు స్వాతి-యాకూబ్ దంపతులకు ఇద్దరు కుమారులు. వినయ్ కిశోర్ (16) మంగపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం, రాజేశ్ (14) కమలాపూర్‌లోని జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నారు. రాఖీ పండగ కోసం ఈ నెల 28వ తేదీన తల్లి స్వాతితో కలిసి ములుగు మున్సిపాలిటీ పరిధిలోని గణేష్‌లాల్‌పల్లిలో ఉంటున్న మేనమామ ఇంటికి వచ్చారు. స్వాతి తన సోదరుడు గణేశ్‌కు రాఖీ కట్టి. . కుమారులను మరుసటి రోజున రమ్మని చెప్పి శనివారం వెళ్లిపోయారు. మేనమామ ఇంటి వద్ద ఉన్న వినయ్ కిశోర్, రాజేశ్‌తో పాటు మరో బాలుడు సాయి కలిసి ఆదివారం గ్రామంలో జరిగిన ఓ వివాహ వేడుకకు వెళ్లారు. మధ్యాహ్న సమయంలో బహిర్భూమి కోసం శివారులో ఉన్న మొండికుంట వద్దకు వెళ్లారు. నీటిలోకి దిగిన అన్న వినయ్ కిశోర్ ప్రమాదవశాత్తు జారి పడ్డాడు. అతడిని కాపాడేందుకు తమ్ముడు రాజేశ్ చేయి అందిస్తూ అతనూ నీళ్లలో పడిపోయాడు. వారివెంట ఉన్న మరో బాలుడు సాయి పరుగున గ్రామంలోకి వెళ్లి చెప్పడంతో బంధువులు, గ్రామస్థులు కుంట వద్దకు చేరుకొని గాలించి మృతదేహాలను వెలికితీశారు. ఎస్సై రచిత్ర ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు. మేనమామ గణేష్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

స్పృహ కోల్పోయిన తల్లి..: కమలాపూర్‌లో ఉన్న తల్లి స్వాతి కుమారుల మరణవార్త విని కన్నీరుమున్నీరుగా విలపించారు. రాత్రికి ఆసుపత్రిలోని మార్చురీ వద్దకు చేరుకున్నారు. తన కుమారులకు ఏమైందంటూ రోదించారు. స్పృహ కోల్పోవడంతో బంధువులు వెంటనే ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు.

వేధింపులతో మహిళ ఆత్మహత్య

ఇద్దరిపై కేసు నమోదు



రాజేశ్వరి

వాజేడు, న్యూస్‌టుడే: ఇద్దరు వ్యక్తుల వేధింపులు భరించలేక వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన ములుగు జిల్లాలో చోటు చేసుకొంది. పేరూరు ఎస్సై కృష్ణప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. వాజేడు మండలం ధర్మవరం గ్రామానికి చెందిన కాట రాజేశ్వరి (26)ని అదే గ్రామానికి చెందిన కాట నవీన్, కావిరి రాజు వేధించేవారు. ఓ కేసు విషయంలో జైలుకు వెళ్లిన ఆమె భర్త ఇక బయటకు రాడని, తాము చెప్పినట్లు నడుచుకోవాలంటూ నిత్యం ఫోన్ చేసి బెదిరించేవారు. వారి నంబర్లు బ్లాక్ చేస్తే ఇతర నంబర్ల ద్వారా ఫోన్లు చేశారు. ఇంటి ముందు ద్విచక్ర వాహనంపై తిరుగుతూ ఇబ్బందులకు గురిచేశారు. వారి వేధింపులు భరించలేక ఆమె ఈ నెల 26వ తేదీన పురుగుల మందు తాగి ఆత్మహత్యా యత్నం చేసింది. గుర్తించిన కుటుంబ సభ్యులు మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. వారి వేధింపులు భరించలేకే ఆమె ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై తెలిపారు. తనకు చిన్న కుమారుడు ఉన్నాడని, తనను వేధించిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలంటూ ఆమె ఆత్మహత్యకు ముందు సెల్‌ఫోన్ ద్వారా పంపిన వీడియో వివరాలు వెల్లడించారు. మృతురాలి తండ్రి బాబూరావు ఫిర్యాదు మేరకు నిందితులు కాట నవీన్, కావిరి రాజుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం



రవిచంద్ర

గచ్చిబౌలి, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందిన ఘటన హైదరాబాద్‌లోని గచ్చిబౌలి ఠాణా పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ సైదులు కథనం ప్రకారం. . హనుమకొండకు చెందిన వేముల రవిచంద్ర (25) బండ్లగూడలో ఉంటూ హోటల్‌లో చెఫ్‌గా పని చేస్తున్నాడు. శనివారం రాత్రి పని నిమిత్తం కొండాపూర్‌కు వచ్చాడు. అర్ధరాత్రి 1:30 సమయంలో తన ద్విచక్ర వాహనంపై ఇంటికి బయలుదేరాడు. మార్గమధ్యలో కొండాపూర్ అర్బోర్ స్కూల్ వద్దకు రాగానే ముందు వెళ్తున్న టిప్పర్ వాహన డ్రైవర్ సిగ్నల్ ఇవ్వకుండా అకస్మాత్తుగా యూటర్న్ తీసుకున్నాడు. రవిచంద్ర వాహనం ఒక్కసారిగా అదుపు తప్పి.. టిప్పర్ వెనక చక్రాల కిందకు దూసుకెళ్లింది. తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. ప్రమాదానికి కారణమైన టిప్పర్ డ్రైవర్ వాహనాన్ని అక్కడే వదిలి పరారయ్యాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్ర వాహనం ఢీకొని మహిళ మృతి

జనగామ రూరల్, న్యూస్‌టుడే: హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారిపై జనగామ మండలం పెంబర్తి వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందారు. జనగామ ఎస్సై చెన్నకేశవులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పెంబర్తికి చెందిన గుండ మల్లమ్మ, మల్లయ్య దంపతులు పెంబర్తి యూ-టర్న్ వద్ద రోడ్డు దాటుతున్న క్రమంలో వెనుకాలే నుంచి ఓ ద్విచక్రవాహనం వచ్చి ఢీ కొట్టింది. ఈ ఘటనలో మల్లమ్మ(50) తలకు, మల్లయ్యకు తీవ్రగాయాలయ్యాయి. వైద్య చికిత్స నిమిత్తం జనగామ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అనంతరం హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మల్లమ్మ మృతిచెందారు. మృతురాలి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వృద్ధుడి బలవన్మరణం

ధర్మసాగర్, న్యూస్‌టుడే: కాజీపేటకు చెందిన చంద బుచ్చయ్య (65) అనే వ్యక్తి పురుగు మందు తాగి ఆదివారం తెల్లవారుజామున ఆత్మహత్య చేసుకున్నట్లు ధర్మసాగర్ ఎస్సై దిలీప్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. కాజీపేటకు చెందిన బుచ్చయ్య మద్యానికి బానిసై శనివారం సాయంత్రం తన ఇంట్లో వారితో ఘర్షణ పడి బయటకు వెళ్లిపోయాడు. ఆదివారం తెల్లవారుజామున పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు పేర్కొన్నారు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారి వచ్చి వివరాలు తెలుసుకున్నారు. బుచ్చయ్య కుమారుడు రాజేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

పడమరకోటలో తాగునీటికి కటకట

ఖిలావరంగల్, న్యూస్‌టుడే: ఖిలా వరంగల్ పడమరకోటలో తాగునీటి సమస్య రోజురోజుకి తీవ్రమవుతోంది. వారానికి ఓ గంట పాటు రాత్రి, పగలు తేగా లేకుండా కుళాయి నీరు సరఫరా చేస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. 37, 38 డివిజన్ల పరిధిలో ఉన్న ఈ ప్రాంతంలో వ్యవసాయ కూలీలు, రైతులు, మధ్యతరగతి, పేదలు ఎక్కువగా నివసిస్తుంటారు. వారంతా తాగునీరు కొనుక్కో లేని స్థితిలో ఇబ్బంది పడుతున్నారు. పలు మార్లు ఎస్సీకాలనీ ప్రజలు ఖాళీ బిందెలతో నిరసనలు తెలిపినా.. పాలకులు పట్టించు కోవడం లేదు. కనీసం నీళ్ల ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా చేయాలని ప్రజలు కోరుతున్నారు.


పడమరకోట ఎస్సీ కాలనీలో ట్యాంకర్ల ద్వారా వచ్చే నీటిని పట్టుకునేందుకు ఇళ్ల ముందు పెట్టిన ప్లాస్టిక్ డ్రమ్ములు

అఖిలపక్ష నాయకుల కార్యాచరణ

పడమరకోటలో తాగునీటి సమస్య పరిష్కరించుకునేందుకు పార్టీలకు అతీతంగా అఖిలపక్ష నాయకులు ఐక్యంగా ఉద్యమించడానికి సిద్ధమయ్యారు. ఇటీవల పలు మార్లు సమావేశాలు ఏర్పాటు చేసి ఈ సమస్యపై చర్చించారు. గతంలో తాగునీటి కోసం చేసిన పోరాటాలను గుర్తు చేసుకుంటూ.. ప్రస్తుత సమస్య పరిష్కారానికి ఏ విధంగా ముందుకు సాగాలనే విషయాలపై కార్యాచరణ రూపొందిస్తున్నారు.

ఎందుకీ సమస్య

ఖిలా వరంగల్ పడమర, మధ్య, తూర్పుకోటల ప్రజల తాగునీటి అవసరాలకు అనుగుణంగా మధ్యకోట ఏకశిలగుట్ట వద్ద రిజర్వాయర్ నిర్మించారు. కుటుంబాలు, ప్రజల అవసరాలు పెరగడంతో పడమరకోటకు వచ్చే పైపులైన్‌ను అధికారులు మూసివేశారు. ప్రస్తుతం మధ్య, తూర్పుకోటలకు తాగునీరు రెండు రోజులకు ఓసారి సరఫరా చేస్తున్నారు. పడమరకోటకు మాత్రం రంగశాయిపేట రిజర్వాయర్ నుంచి సరఫరా చేయాల్సి ఉంది. దీంతో స్థానిక కాలనీలకు సమృద్ధిగా తాగునీరు సరఫరా చేసిన తర్వాతే పడమరకోటకు పంపిణీ చేస్తున్నారు.

కొత్తది నిర్మించాల్సిందే..

స్థానికంగా కొత్త రిజర్వాయర్ నిర్మిస్తేనే సమస్యకు పరిష్కారం లభిస్తుందని అధికారులు వెల్లడించారు. ఎస్టీ కాలనీలో స్థల పరిశీలన చేశామని త్వరలోనే పనులు ప్రారంభిస్తామని చెప్పుకొచ్చారు. అది పూర్తి కావాలంటే కనీసం రెండేళ్లు అవుతుంది. అప్పటి వరకు తాగునీటి తిప్పలు తప్పవా? అంటూ ప్రజలు వాపోతున్నారు. ప్రత్యామ్నాయ మార్గాలు ఆలోచిస్తున్నామని అధికారులు చెబుతున్నారు.

వర్షా కాలంలోనూ నీటి కష్టాలు

- మందాటి సరోజన స్థానికురాలు



సాధారణంగా ఎక్కడైనా.. వేసవిలో నీటి కష్టాలు వస్తాయి. మాకు కాలమేదైనా.. తాగునీటి కష్టాలు తప్పడం లేదు. వారానికి ఓ రోజు నీరు వస్తుంది. వాటిని ప్లాస్టిక్ డ్రమ్ముల్లో నిల్వ చేసుకొని వాడుతున్నాం. అధికారులు స్పందించి, పరిష్కారం చూపాలి.

వైభవంగా పోచమ్మ బోనాలు


సంగెంలో.. బోనాలతో ఆలయానికి వెళ్తున్న మహిళలు


శంభునిపేట విశ్వనాథ కాలనీలో..

సంగెం, రంగశాయిపేట, న్యూస్‌టుడే: జిల్లావ్యాప్తంగా ఆదివారం పోచమ్మ బోనాల వేడుకలు జరిగాయి. మహిళలు భక్తిశ్రద్ధలతో బోనాలతో తరలివెళ్లి మొక్కులు సమర్పించారు. శంభునిపేట విశ్వనాథ కాలనీలో పోచమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాలనీ అధ్యక్షుడు కర్నె రవీందర్, మంగపేట తహసీల్దార్ తోట రవీందర్, కాలనీ పెద్దలు, ప్రజాప్రతినిధులు, మహిళలు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



రామన్నపేట, న్యూస్‌టుడే: ఉర్సు, కరీమాబాద్ శ్రీవేంకటేశ్వర ఎయిడెడ్ ఉన్నత పాఠశాల 2003-04 పదో తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం పాఠశాల ఆవరణలో జరిగింది. ఉపాధ్యాయులు సోమశేఖర్, సుధాకర్‌రెడ్డి, ప్రభాకర్, విద్యాసాగర్, శ్రీనివాస్‌ను సన్మానించారు.

ఆలయ ప్రారంభోత్సవం

దుగ్గొండి, న్యూస్‌టుడే: దుగ్గొండి మండలం తిమ్మంపేట గ్రామంలో నిర్మించిన పోచమ్మ తల్లి దేవాలయ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి పాల్గొని ఆదివారం పూజలు చేశారు. ఆలయ నిర్మాణ దాతలు స్వరూప, సూరారెడ్డి, అరుణ, ప్రభాకర్‌రెడ్డిలతో కలిసి అమ్మవారి విగ్రహాన్ని ఎమ్మెల్యే ప్రతిష్ఠించారు. సర్పంచి శ్రీలత, ఉపసర్పంచి దిలీప్, నియోజకవర్గ కాంగ్రెస్ కన్వీనర్ శ్రీనివాస్‌రెడ్డి, మండల అధ్యక్షుడు రమేష్ పాల్గొన్నారు.


పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే దొంతి

హనుమకొండ తహసీల్దార్ కార్యాలయం మార్పు

హనుమకొండ కలెక్టరేట్: జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ ఆదేశాల మేరకు నగరంలోని సర్క్యూట్ అతిథి గృహంలోని హనుమకొండ మండల తహసీల్దార్ కార్యాలయాన్ని హనుమకొండ జిల్లా పరిషత్తు ఛైర్మన్ అతిథి గృహంలోకి మార్చినట్లు తహసీల్దార్ జి.రవీందర్‌రెడ్డి ఆదివారం తెలిపారు. మంగళవారం నుంచి కార్యాలయంలో పూర్తి సేవలు అందుబాటులో ఉంటాయని, మండల ప్రజలు ఈ విషయాన్ని గమనించాలన్నారు.

కలెక్టరేట్, రెవెన్యూ డివిజన్లు, మండలాల్లో ప్రజావాణి

వరంగల్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం జిల్లా కలెక్టరేట్, రెవెన్యూ డివిజన్లు, మండలాల్లో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ డా.సత్యశారద ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాస్థాయి అధికారులు కలెక్టరేట్, రెవెన్యూ డివిజన్లలో డివిజన్ స్థాయి అధికారులు, ఎంపీడీవో కార్యాలయాల్లో మండలస్థాయి అధికారులు ప్రజావాణికి హాజరుకావాలన్నారు. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా కలెక్టరేట్‌లో సోమవారం ఉదయం 10 గంటలకే ప్రజావాణి మొదలవుతుందన్నారు.

నేత్రదానంతో మరొకరికి చూపు

కాజీపేట, న్యూస్‌టుడే: నేత్ర దానం చేయడం వల్ల మరొకరికి చూపు లభిస్తుందని హసన్‌పర్తి ప్రాథమిక వైద్యశాల నేత్ర వైద్యుడు ప్రతాపగిరి ప్రసాద్ అన్నారు. ప్రశాంత్‌నగర్‌లోని సహృదయ వృద్ధాశ్రమంలో 41వ నేత్రదాన పక్షోత్సవాలను పురస్కరించుకుని వృద్ధులకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి నేత్ర దానంపై అవగాహన కలిగించారు.

రక్తదానం అభినందనీయం

ఖిలావరంగల్, న్యూస్‌టుడే: ప్రతిఒక్కరూ రక్తదానం చేసి ఆపదలో ఉన్న ప్రాణాన్ని కాపాడాలని యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు సిరుపా అనిల్ అన్నారు. ఆదివారం శివనగర్‌లో జిల్లా ఆర్యవైశ్య మహాసభ యువజన విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. నిత్యం అన్నదానం, అక్షరదానం చేయడంతో పాటు రక్తదానం సైతం చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ శిబిరంలో స్వచ్ఛందంగా తరలి వచ్చి 60 మంది రక్తదానం చేశారు. జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు దుబ్బ శ్రీనివాస్, వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ ఉపాధ్యక్షుడు గాలపటి శ్రీనివాస్, వేణు, పనిష్, సుమన్, వినయ్, శ్రీనివాస్, వేణు, శంకర్‌గోపాల్, నాగేంద్రబాబు పాల్గొన్నారు.


రక్తదానం చేస్తున్న శ్రీనివాస్‌తో సంఘం సభ్యులు

ప్రమాదకరంగా విద్యుత్తు బోర్డు

నర్సంపేట, న్యూస్‌టుడే: నర్సంపేట పట్టణం ద్వారకపేట ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో కార్యాలయం గదిలో గోడకు అమర్చిన విద్యుత్తు మెయిన్ బోర్డు ప్రమాదకరంగా ఉంది. పాఠశాలలో విద్యార్థుల, ఉపాధ్యాయుల సౌకర్యార్థం గత కొన్నేళ్లుగా విద్యుత్తు వసతి కల్పించారు. ఉపాధ్యాయుల కార్యాలయం గదిలో విద్యుత్తు మీటర్, మెయిన్ బోర్డులను ఏర్పాటు చేశారు. వాటి నుంచి మిగతా గదుల్లోకి కరెంటు సరఫరా ఇచ్చారు. మీటర్ పక్కన అమర్చిన మెయిన్ బోర్డు స్విచ్ పై కప్పు పెట్టె లేకుండా పోవడంతో కింది భాగంలో ఫ్యూజుల కనెక్షన్ తీగలు, క్లిప్పులు బహిర్గతంగా కనిపిస్తూ ప్రమాదకరంగా ఉంది. అధికారులు స్పందించి బడిలో ప్రమాదంగా ఉన్న విద్యుత్తు మెయిన్ బోర్డును బాగు చేయాలని కోరుతున్నారు.



క్లబ్ హౌజ్ మేనేజరు సేవలు మరవలేనివి


మేనేజరు భుజంగరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఓసిటీ కమిటీ అధ్యక్షుడు చంద్రశేఖర్ తదితరులు

లేబర్‌కాలనీ, న్యూస్‌టుడే: ఓసిటీ క్లబ్ హౌజ్ మేనేజరుగా సుదీర్ఘకాలం పనిచేసిన భుజంగరావు మరణం తీరనిలోటు అని ఓసిటీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జోగు చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం ఓసిటీలో నిర్వహించిన సంతాప సభలో పాల్గొన్న చంద్రశేఖర్ భుజంగరావు చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఓసిటీ కమిటీ పక్షాన భుజంగరావు కుటుంబానికి రూ.4.16 లక్షల ఆర్థిక సాయం అందించారు. వరంగల్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యుడు కంచ సంపత్, ఓసిటీ కమిటీ సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి, దయ్యాల ప్రభాకర్, పోతన లక్ష్మీనర్సయ్య, వక్కల రామన్న, రామా వెంకటనారాయణ పాల్గొన్నారు.

గద్దె కూల్చిన వారిపై చర్యలు తీసుకోవాలి

నల్లబెల్లి, న్యూస్‌టుడే: మండలంలోని ముచ్చింపుల గ్రామంలో ఏర్పాటు చేసిన భాజపా జెండా గద్దె కూల్చిన వారిపై చర్యలు తీసుకోవాలని భాజపా జిల్లా ప్రధాన కార్యదర్శి గోగుల రాణా ప్రతాప్‌రెడ్డి అన్నారు. ఆదివారం గ్రామంలోని గద్దెను పరిశీలించి మాట్లాడారు. పార్టీ జెండాను కూల్చివేయడం సరికాదన్నారు. ఆయన వెంట మండల భాజపా నాయకులు వినయ్‌గౌడ్, కుమారస్వామి, నరేష్, వెంకటేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.


పరిశీలిస్తున్న రాణా ప్రతాప్‌రెడ్డి, భాజపా నేతలు

ఆర్థిక సాయం అందజేత



గీసుకొండ(సంగెం), న్యూస్‌టుడే: గీసుకొండ మండల కేంద్రానికి చెందిన వటుకుల మధుసూదన్‌రెడ్డి గత కొంత కాలంగా తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధ పడుతున్నారు. ఆయనతో కలిసి 1996-1997 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న మిత్రులు ఆదివారం స్నేహితుడిని కలిసి వైద్య ఖర్చుల కోసం రూ. 25 వేలను ఆర్థిక సాయంగా అంజేశారు.

కూడలి.. ఎగుడు దిగుడుగా మారి



ఇటీవల కురిసిన వర్షాలతో హనుమకొండ వడ్డేపల్లి చర్చి కూడలిలో వేసిన మొరం కొట్టుకుపోతూ గుంతలతో అధ్వానంగా తయారైంది. దారంతా ఎగుడు దిగుడుగా మారడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇది నాలుగు దారులు కలిసే ఇరుకైన కూడలి కావడంతో ద్విచక్ర వాహనదారులు, కార్లు, భారీ వాహనాల రాకపోకలకు తీవ్ర ఆటంకం కలుగుతోంది. అయితే దెబ్బతిన్న రహదారి పక్కన ఆటో స్టాండు ఉండటంతో ఎప్పుడు ఏ వాహనం అదుపు తప్పి ప్రమాదానికి గురవుతుందోనని ప్రయాణికులు, బాటసారులు ఆందోళన చెందుతున్నారు. కూడలిలో దారికి మరమ్మతులు చేపట్టాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, వడ్డేపల్లి

కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టాలి

రాయపర్తి(వర్ధన్నపేట), న్యూస్‌టుడే: కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లో ఎండగట్టాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు భారాస నాయకులు, కార్యకర్తలకు సూచించారు. రాయపర్తి మండల కేంద్రంలో ఆదివారం భారాస నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దయాకర్‌రావు మాట్లాడుతూ.. సెప్టెంబరు 1 నుంచి 8 వరకు వారంరోజుల పాటు కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు, 420 హామీల మోసాలను ప్రజలు తెలియజేయాలన్నారు. ఆందోళన, నిరసన కార్యక్రమాల్లో పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో భారాస నాయకులు పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహానాయక్, అనిమిరెడ్డి, రంగుకుమార్‌గౌడ్, మధు, సురేందర్ రాథోడ్, రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

విద్యా బలోపేతానికి బాటలు

జవాబు పత్రాల మూల్యాంకనంలో కొత్త విధానం

భూపాలపల్లి, న్యూస్‌టుడే: ప్రభుత్వ బడుల్లో చదువుతున్న విద్యార్థుల జవాబుపత్రాల మూల్యాంకనలో పాఠశాల విద్యాశాఖ నూతన విధానానికి శ్రీకారం చుట్టింది. పూర్తిస్థాయిలో సబ్జెక్టులపై పట్టులేని విద్యార్థులను ముందే గుర్తించి, వారికి మెరుగైన విద్యనందించే లక్ష్యంతో ‘ ఎక్స్‌టర్నల్ ఎవాల్యుయేషన్ సిస్టమ్’ పేరుతో ఈ విధానాన్ని రూపొందించారు. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ ఉత్తర్వులు జారీ చేయగా, ఇది ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచే అమలులోకి రానుంది. మార్కుల కేటాయింపులో పారదర్శకత, మూల్యాంకనంలో జవాబుదారీతనం పెంచేందుకు ఈ విధానం ఎంతో ఉపయోగపడుతుందని ఉపాధ్యాయులు అభిప్రాయ పడుతున్నారు.


తరగతి గదిలో విద్యార్థులు

ఉమ్మడి జిల్లా గణాంకాలు..

జిల్లా	పాఠశాలలు	విద్యార్థులు
వరంగల్	724	32,661
భూపాలపల్లి	414	18,970
మహబూబాబాద్	762	40,109
ములుగు	473	18,410
హనుమకొండ	492	30,763
జనగామ	408	29,837

ఇతర పాఠశాలల ఉపాధ్యాయులతో..

పరీక్ష పూర్తి కాగానే సమాధాన పత్రాలను ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు స్థానిక మండల విద్యా వనరుల కేంద్రంలో (ఎమ్మార్సీ) ఎంఈవోకు అప్పగిస్తారు. అదే మండలానికి చెందిన ఇతర ఉపాధ్యాయులు జవాబుపత్రాల మూల్యాంకనం చేస్తారు. ఈ మేరకు ప్రతి మండల కేంద్రంలో ప్రత్యేకంగా మూల్యాంకన కేంద్రాన్ని ఏర్పాటు చేస్తారు. అయితే సొంత పాఠశాలలకు చెందిన జవాబుపత్రాలను దిద్దడానికి, మార్కులు కేటాయించే అవకాశం ఉండదు. సమాధాన పత్రాలు మూల్యాంకనం చేసి, మూడు నుంచి ఐదు రోజుల లోపు మార్కుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి. ప్రాథమిక, ప్రాథమికోన్నత స్థాయిలో ఒక్కో జవాబుపత్రానికి రూ.2, 7, 8, 9 తరగతుల సమాధాన పత్రాలకు రూ.3 చొప్పున పారితోషికం చెల్లిస్తారు.

అంతర్జాల సౌకర్యం ఉండాలి..

ప్రతి మండల కేంద్రంలో ఏర్పాటు చేయనున్న జవాబు పత్రాల మూల్యాంకన కేంద్రంలో సీసీ కెమెరాలు, కంప్యూటర్లు, ఇంటర్నెట్ సహా అన్ని సౌకర్యాలు కల్పించాలి. పరీక్షలు నిర్వహించడం, జవాబుపత్రాలు సేకరించి జాగ్రత్తగా సీల్‌చేసి, గుర్తింపు వివరాలను కవర్‌పై నమోదు చేసి, ఎమ్మార్సీలో అప్పగించడం ఆయా పాఠశాలల హెచ్‌ఎంలదే పూర్తి బాధ్యత. పాఠశాలల నుంచి వచ్చిన సీల్డ్ కవర్లను స్వీకరించడం, వాటిని సరిచూసుకుని, రిజిస్టర్‌లో నమోదు చేసి, జవాబుపత్రాలు జాగ్రత్తగా భద్రపర్చడం మండల విద్యాశాఖ అధికారి బాధ్యత. ఆన్‌లైన్‌లో నమోదు సకాలంలో జరిగే విధంగా ఎంఈవోలు చూసుకోవాలి. ఈ కార్యక్రమంపై జిల్లా విద్యాశాఖ అధికారి సమీక్షించాలి.

చర్చి మహిళా కమిటీ ఎన్నిక



కాశీబుగ్గ, న్యూస్‌టుడే: వరంగల్ భగత్‌సింగ్ నగర్‌లోని బెతెస్థ బాప్టిస్టు చర్చి మహిళా కమిటీ ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నికైంది. గౌరవ అధ్యక్షురాలిగా పొలెపాక స్రవంతి, అధ్యక్షురాలిగా పొలెపాక ఇందిర, కార్యదర్శిగా కొమ్ము అనురాధ, కోశాధికారిగా కొమ్ము సరిత, ఉపాధ్యక్షురాలిగా కొల్లూరి దీప, సహ కార్యదర్శిగా జ్యోత్స్న, ఉప కోశాధికారిగా పొలెపాక సరళ, డైరెక్టర్‌గా పొలెపాక విజయ ఎన్నికయ్యారు. నూతన కమిటీ ప్రతినిధుల బాధ్యతల స్వీకరణ కార్యక్రమానికి చర్చి పాస్టర్ పొలెపాక కరుణ్‌సాగర్, చర్చి కమిటీ ప్రతినిధులు పొలెపాక సీతయ్య, కొమ్ము రాజు, పొలెపాక ప్రసాద్ తదితరులు హాజరయ్యారు.

దంపతులపై యువకుల దాడి

రంగశాయిపేట, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనంపై వెళ్తున్న దంపతులపై దాడి చేసిన ఘటన శనివారం రాత్రి శంభునిపేటలో చోటుచేసుకుంది. మద్యం మత్తులో ఉన్న ముగ్గురు యువకులు రోడ్డుపై ప్రయాణిస్తున్న దంపతులను ఎటువంటి కారణం లేకుండా అడ్డగించి దాడి చేసి గాయపర్చారు. చింతల్ ప్రాంతానికి చెందిన బాధితులు మిల్స్‌కాలనీ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

హనుమాన్ ఆలయంలో ప్రతిష్ఠాపన పూజలు

ఖిలావరంగల్, న్యూస్‌టుడే: చింతల్‌లో శ్రీభక్త హనుమాన్ దేవాలయంలో నవగ్రహ, ధ్వజస్తంభం, ఆలయ శిఖర ప్రతిష్ఠాపన మహోత్సవం ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, వరంగల్ అర్బన్ కో-ఆపరేటివ్ బ్యాంకు ఛైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, భాజపా జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ హాజరయ్యారు. ఆలయ నిర్వహణ కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం మర్రి శ్రీనివాస్- రజిత దంపతులు అన్నప్రసాద వితరణ చేపట్టారు.


పూజలు చేస్తున్న ప్రదీప్‌రావు

భూదాతలకు ఘనంగా సత్కారం

సంగెం, న్యూస్‌టుడే: మొమ్మిడివరం గ్రామపంచాయతీ భవనం, మహిళా సంఘం భవనం నిర్మాణం కోసం 3 గుంటల భూమిని దానంగా ఇచ్చిన దామెరుప్పుల రాజేశ్, విజయ్‌లను కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రవికుమార్ ఆదివారం ఘనంగా సత్కరించారు. రాజేశ్ తండ్రి సారయ్య జ్ఞాపకార్థంగా గ్రామ పంచాయతీకి భూమిని ఇవ్వడం అభినందనీయమని కొనియాడారు. అనంతరం భవన నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో సర్పంచి వీరస్వామి, నాయకులు మాధవరెడ్డి, రమేశ్, కేశవులు, శ్రీనివాసరావు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.


రాజేశ్‌ను శాలువాతో సత్కరిస్తున్న రవికుమార్

విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి

గీసుకొండ(సంగెం), న్యూస్‌టుడే: విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి చెందిన ఘటన మండలంలోని శాయంపేట హవేలీ గ్రామంలో జరిగింది. బాధిత రైతు సుమన్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం పాడి పశువులు మేత మేయడానికి వెళ్లాయి. వేలాడుతున్న విద్యుత్తు తీగలు తాకడంతో పాడి గేదె అక్కడికక్కడే మృతి చెందింది. మరొకటి తీవ్రంగా గాయపడటంతో వైద్యం అందించారు. విద్యుత్తు అధికారులకు పలుమార్లు తీగలు సరిచేయాలని ఫిర్యాదు చేసినా. స్పందించలేదని బాధితుడు ఆరోపించారు.

‘వ్యవసాయాన్ని నష్టపర్చేలా ప్రభుత్వ విధానాలు’

నర్సంపేట, న్యూస్‌టుడే: రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించకుండా వ్యవసాయ రంగాన్ని నష్టపర్చేలా కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్నాయని అఖిల భారత రైతుకూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు తిరుపతి, కార్యదర్శి కృష్ణ విమర్శించారు. ఆదివారం నర్సంపేటలో జరిగిన ఆ సంఘం సమావేశంలో వారు మాట్లాడారు. పాలక ప్రభుత్వాలు అనుసరిస్తున్న రైతాంగ వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. సెప్టెంబరు 8, 9 తేదీల్లో మంచిర్యాల జిల్లా కేంద్రంలో జరిగే సంఘం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. సంఘం నాయకులు ఐలయ్య, రమేశ్, ఎ.రాజు, ఆర్.ఐలయ్య, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.


గోడ పత్రికలను ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

ఎమ్మెల్యేను కలిసిన పద్మశాలి సంఘం బాధ్యులు

నర్సంపేట, న్యూస్‌టుడే: నర్సంపేట పద్మశాలి సంఘం పట్టణ సంఘం ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికైన నూతన కార్యవర్గం బాధ్యులు ఆదివారం ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డిని కలిశారు. రెండ్రోజుల క్రితం జరిగిన ఎన్నికల్లో పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్షుడిగా రవీందర్, ప్రధాన కార్యదర్శిగా భాస్కర్, కోశాధికారిగా రాము ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కొత్తగా ఎన్నికైన కమిటీ బాధ్యులు పీసీసీ సభ్యుడు రామానంద్ ఆధ్వర్యంలో స్థానిక క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. త్వరలో జరిగే తమ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరు కావాలని ఆహ్వానించారు. కార్యక్రమంలో పద్మశాలి కుల పెద్దలు, బాధ్యులు పలువురు పాల్గొన్నారు.



ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకే ‘చలో దిల్లీ’

గిర్మాజీపేట, న్యూస్‌టుడే: దేశంలో పెరుగుతున్న నిరుద్యోగం, నిత్యావసర సరకుల ధరలు, ప్రజాస్వామ్య హక్కుల హననం, కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకే ‘చలో దిల్లీ’ కార్యక్రమం చేపట్టినట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి షేక్ బాష్ మియా తెలిపారు. సీపీఐ పిలుపు మేరకు సెప్టెంబరు ఒకటో తేదీన న్యూదిల్లీలోని రాంలీలా మైదానంలో తలపెట్టిన ‘బద్లావ్ జరూరీ హై’ (మార్పు తప్పనిసరి) సభలో పాల్గొనేందుకు ఆదివారం సీపీఐ జిల్లా నాయకులు, కార్యకర్తల బృందం దిల్లీకి పయనమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రం అనుసరిస్తున్న కార్పొరేట్ అనుకూల, విద్వేషపూరిత విధానాలతో కార్మికులు, కర్షకులు, యువత, నిరుద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గుండె బద్రి, చెన్నకేశవులు, వీరగోని శంకరయ్య, గోవర్ధనచారి పాల్గొన్నారు.



వరంగల్ రైల్వేస్టేషన్ నుంచి దిల్లీకి బయల్దేరిన సీపీఐ నాయకులు

ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడి ఎన్నిక

భీమదేవరపల్లి, న్యూస్‌టుడే: భీమదేవరపల్లి ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడిగా వేల్పుల ప్రశాంత్‌ను ఎన్నుకున్నట్లు జిల్లా ఇన్‌ఛార్జి వెంకటేశ్వర్‌రావు, నియోజకవర్గ ఇన్‌ఛార్జి మాట్ల వెంకటస్వామి తెలిపారు. ఆదివారం మండలంలోని ములుకనూర్ విశ్వశాంతి ఉన్నత పాఠశాలలో ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల ప్రధాన కార్యదర్శి మిట్టపల్లి రమేష్, అధికార ప్రతినిధిగా మాడుగుల ప్రణయ్, ఉపాధ్యక్షులుగా ఎర్రబెల్లి దిలీప్, ఎంఎస్పీ మండల అధ్యక్షుడిగా ప్రవీణ్‌లను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ జిల్లా కోఇన్‌ఛార్జి విజయ్, నాయకులు కండె రమేష్, తాళ్లపల్లి మధుకర్, రాజయ్య, స్వామి, సురేష్, సంజీవ్, సురేష్ పాల్గొన్నారు.